## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 07-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- మాల్దీవులకు సన్నిహిత పొరుగుదేశంగా భారత్ తన బాధ్యతను ఎల్లప్పుడూ నిర్వర్తిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు.
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 70వ జాతీయ చలనచిత్ర అవార్డులను రేపు న్యూఢిల్లీలో ప్రదానం చేయనున్నారు.
- కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో 2026 నాటికి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు.
- హర్యాణ, జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ రేపు ఉదయం ప్రారంభం కానుంది.
- అమెరికాకు చెందిన విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రవ్ కున్‌లకు వైద్యశాస్త్రంలో నోబెల్ పురస్కారం లభించింది.

================================

మాల్దీవులకు సన్నిహిత పొరుగుదేశంగా భారత్ తన బాధ్యతను ఎల్లప్పుడూ నిర్వర్తిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఈరోజు న్యూ ఢిల్లీలో మాల్దీవుల అధ్యక్షులు డాక్టర్ మహ్మద్ మొయిజుతో ద్వైపాక్షిక చర్చలు జరిపిన అనంతరం చేసిన సంయుక్త పత్రికా ప్రకటనలో నరేంద్రమోదీ మాట్లాడుతూ.. భారత్ - మాల్దీవుల మధ్య సంబంధం శతాబ్దాల నాటిదని, మాల్దీవుల క్లిష్ట పరిస్థితుల్లో భారత్ ఎప్పుడూ మొదట స్పందిస్తుందని అన్నారు. భారత్ తన నైబర్‌హుడ్ ఫస్ట్ పాలసీ, సాగర్ విజన్‌లో మాల్దీవులకు కూడా ముఖ్యమైన స్థానం ఉందని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

ఈ సందర్భంగా  మాల్దీవుల్లో కూడా రూపే కార్డ్ చెల్లింపులతో సహా వివిధ రంగాల్లో ఇరు దేశాధి నాయకుల సమక్షంలో పలు కీలక అవగాహన ఒప్పందాలు జరిగాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపు న్యూఢిల్లీలో 2022 సంవత్సరానికి గానూ 70వ జాతీయ చలనచిత్ర అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తిని సినీ రంగంలో అత్యున్నత గుర్తింపు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుతో సత్కరించనున్నారు. కన్నడ చిత్రం కాంతారాలో అద్భుతమైన నటనకుగాను రిషబ్ శెట్టికి ఉత్తమ నటుడి అవార్డును అందజేయనున్నారు. ఉత్తమ నటి అవార్డును నిత్యా మీనన్, మానసి పరేఖ్ లు కలిసి అందుకోనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో దేశం నుంచి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తున్నామని కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా అన్నారు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో అమిత్ షా అధ్యక్షతన ఈరోజు న్యూఢిల్లీలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ అభివృద్ధి పథంలో నక్సలిజమే పెద్ద అవరోధమని, దీని వల్ల ఎవరికీ ప్రయోజనం లేదని అన్నారు. నక్సలిజంతో సంబంధం ఉన్న యువకులందరూ ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో చేరాలని అమిత్ షా విజ్ఞప్తి చేశారు. 2026 మార్చి నాటికి వామపక్ష తీవ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని హోం మంత్రి స్పష్టం చేస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇటీవల ఎన్నికలు జరిగిన హర్యాణ, జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీల ఓట్ల లెక్కింపు ప్రక్రియ రేపు ఉదయం ప్రారంభం కానుంది. జమ్మూ కాశ్మీర్‌లో 873 మంది అభ్యర్థులు, హర్యానాలో 1031 మంది అభ్యర్థులు ఈ ఎన్నికల పోటీలో నిలిచారు. జమ్మూకశ్మీర్‌లో కట్టుదిట్టమైన భద్రతతో 20 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా పోలీసు బలగాలతో పాటు కేంద్ర, రాష్ట్ర సాయుధ పోలీసు బలగాల 3 అంచెల భద్రతా వ్యవస్థను అన్ని జిల్లా కేంద్రాల్లోని కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేశారు. డిప్యూటీ ఎస్పీ స్థాయి అధికారి స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాలు వద్ద భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. అలాగే హర్యానాలో మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి 90 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 22 జిల్లాల జిల్లా కేంద్రాల్లో ఈ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రధాన ఎన్నికల అధికారి పంకజ్ అగర్వాల్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రాథమిక ఆరోగ్య సంరక్షణతో పాటూ అత్యవసరమైన సేవలను బలోపేతం చేయడంపై భారత్ దృష్టి సారించిందని కేంద్ర ఆరోగ్యశాఖా మంత్రి జేపీ నడ్డా ఈరోజు అన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఆగ్నేయాసియా ప్రాంత 77వ సెషన్‌లో ఈరోజు ఆయన పాల్గొని ప్రసంగిస్తూ... యూనివర్సల్ హెల్త్ కవరేజ్ (UHC) సాధించడానికి భారతదేశ ఆరోగ్య వ్యవస్థ మొత్తం ప్రభుత్వం, మొత్తం సమాజం విధానాన్ని అవలంభిస్తున్నదని పేర్కొన్నారు. “ఆయుష్మాన్ భారత్” – “ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన”కు 120 మిలియన్ల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం అనుసంధానించిందని, ప్రతీ కుటుంబానికి 5 లక్షల రూపాయల వార్షిక ఆసుపత్రి ప్రయోజనాన్ని అందించిందని ఆయన తెలియజేశారు. కాగా జే.పీ. నడ్డా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఆగ్నేయాసియా ప్రాంతీయ కమిటీ 77వ సెషన్‌కు చైర్‌పర్సన్‌గా కూడా ఎన్నికయ్యారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వైద్యశాస్త్రంలో విశేష కృషి చేసినందుకుగాను అమెరికాకు చెందిన విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రవ్ కున్‌లకు ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారాన్ని ప్రకటించారు. మైక్రో ఆర్ఎన్ఎ, ట్రాన్స్ క్రిప్షనల్ జన్యు నియంత్రణలో దాని పాత్రను కనుగొన్నందుకు గుర్తింపుగా 2024 సంవత్సరానికి గానూ నోబెల్ పురస్కారం లభించింది. స్వీడన్‌లోని స్టాక్‌హోంలో ఉన్న కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్‌లోని నోబెల్ బృందం ఈ పురస్కారాలను ప్రకటించింది. కాగా రానున్న రెండు రోజుల్లో భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రాల్లోనూ నోబెల్ పురస్కారాలను ప్రకటిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి జరిగి ఈరోజుతో ఒక సంవత్సరం పూర్తయింది. ప్రస్తుత పశ్చిమాసియా సంఘర్షణలకు ఇది ఆజ్యం పోసింది. గత సంవత్సరం అక్టోబరు 7న హమాస్ చేసిన దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకోవడానికి ఇజ్రాయెల్ ప్రజలు పలుచోట్ల వేలాది మందిగా చేరి నివాళులు అర్పించారు. పశ్చిమాసియాలో ఇప్పటికీ కొనసాగుతున్న ఘర్షణల కారణంగా ఇప్పటివరకూ 41 వేల మందికి పైగా మరణించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పెరూలో జరిగిన ISSF జూనియర్ వరల్డ్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌ను భారత్ విజయవంతంగా ముగించింది. 13 స్వర్ణాలు, 3 రజతాలు, 8 కాంస్యాలతో కలిపి మొత్తం 24 పతకాలతో భారత షూటర్లు పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిచారు. ఇటలీ రెండవ స్థానంలోనూ, నార్వే మూడవ స్థానంలో నిలిచింది. కాగా రైఫిల్, పిస్టల్ షాట్‌గన్ విభాగాల్లో ప్రతిష్టాత్మక ISSF ప్రపంచ కప్ ఫైనల్స్ ఈనెల 13 నుండి 18వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరగనున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 81 వేల 926.99 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 82 వేల 137.77 వద్ద గరిష్ఠాకి చేరింది. అనంతరం 80 వేల 726.06 వద్ద కనిష్ఠాన్ని తాకి 638.45 పాయింట్ల నష్టంతో 81 వేల 050 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 218.85 పాయింట్ల నష్టంతో 24 వేల 795.75 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.99గా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో వ్యవసాయ సంస్కృతిని పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో రైతులు, రైతు సంఘాలతో ఆయన సమావేశమయ్యారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం రైతుల సాధికారత కోసం కృషి "వికాస్ యోజన", "ఫసల్ బీమా యోజన" వంటి అనేక నిర్ణయాలు తీసుకుందని కేంద్రమంత్రి పునరుద్ఘాటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారని అధికార వర్గాలు వెల్లడించాయి. అనంతరం రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో సమావేశమయ్యారు. రేపు ఉదయం 11 గంటల 30 నిమిషాలకు కేంద్ర మంత్రి గడ్కరీని కలవనున్నారు. సాయంత్రం పెట్రోలియం మంత్రి హర్‌దీప్ సింగ్ పురీతో భేటీ కానున్నారు. ఆ తర్వాత రాత్రి 8 గంటలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో, రాత్రి 11.15 గంటలకు నిర్మలా సీతారామన్‌తో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =